బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 15 డిసెంబర్ 2024 www.balagamtv.com పేజీలు 4

## ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఆధార్‌ను ఉచితంగా అప్‌డేట్ చేసుకునే గడువును యూఐడీఏఐ మరో ఆరు నెలలు పొడిగించింది. వాస్తవానికి ఈ గడువు శనివారంతో ముగియగా, దానిని వచ్చే ఏడాది జూన్ 14 వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. దీని కారణంగా లక్షలాది మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది. ఆధార్‌లోని పేరు, లింగం, పుట్టిన తేదీ, చిరునామా తదితరాలను మార్చుకోవాలనుకే వారు https:// myaadhaar /uidai.gov.in పోర్టల్‌లోకి వెళ్లి తమ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చునని యూఐడీఏఐ వివరించింది.




# దేశం ప్రజాస్వామ్యానికి మాత



- ప్రధాని మోడీ
- లోక్‌సభలో 'రాజ్యాంగం'పై ప్రత్యేక చర్చ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భారతదేశాన్ని ప్రజాస్వామ్య మాతగా పిలుస్తున్నారని ప్రధాని మోడీ అన్నారు. భారత దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంపై ప్రత్యేక చర్చ చేపట్టారు. శుక్ర, శనివారాల్లో ఈ చర్చ కొనసాగింది. శనివారం సాయంత్రం ప్రధాని నరేంద్రమోదీ చర్చకు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన భారతదేశ గతమెంతో ఘనమైనదని చెప్పారు. 75 ఏళ్ల రాజ్యాంగ యాత్ర ఓ గొప్ప ప్రయాణమని అన్నారు. మన రాజ్యాంగ నిర్మాతల దీర్ఘకాలిక దృక్పథం, సహకారంతో మనం ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఇది సంబురాలు జరుపుకోవాల్సిన క్షణమని ప్రధాని చెప్పారు. ఈ రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న వారందరికీ ఆయన అభినం దనలు తెలిపారు. రాజ్యాంగ రూపకల్పన చేసిన రాజ్యాంగ నిర్మాతలతోపాటు దేశంలోని లక్షలాది మంది పౌరులకు తాను గౌరవపూర్వకంగా నమస్కరిస్తున్నానని అన్నారు.

1950లోనే భారతదేశం ప్రజాస్వామ్యం దేశం అవుతుందని నమ్మలేదని ప్రధాని వ్యాఖ్యానించారు. భారత దేశ ప్రజాస్వామ్యం, భారతదేశ గణతంత్రం గతం చాలా గొప్పదని ఆయన కొనియాడారు. దేశ ప్రజాస్వామ్యం ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. అందుకే భారతదేశాన్ని ఇప్పుడు ప్రజాస్వామ్య మాతగా పిలుస్తున్నారని చెప్పారు. మనది భారీ ప్రజాస్వామ్యం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి తల్లి కూడా అని ప్రధాని మోదీ అన్నారు.

ఇక 1975లో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటినీ హరించారని, దేశాన్ని జైలుగా మార్చారని మోడీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని గాంధీ కుటుంబం అవమానించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యం గొంతు నొక్కిందని విమర్శించారు. ప్రజల మద్దతు లేకుండానే కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పాలించిందని వ్యాఖ్యానించారు. దళిత నేత సీతారాం కేసరిని కాంగ్రెస్ పార్టీ అవమానించిందని, ఆయనను బాత్రూమ్‌లో బంధించిందని మోదీ గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలకులు ఎమర్జెన్సీ విధించి వేల మందిని జైళ్లకు తరలించారని ఆరోపించారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ ముగ్గురూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీశారని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ ప్రజలను విభజించారని మండిపడ్డారు.



## గురుకులాల్లో చదివి

# ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారు

- భవిష్యత్ తరాల నిర్మాణ కేంద్రంగా గురుకులాలు
- ఉపాధి కల్పనకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ
- సీఎం రేవంత్‌రెడ్డి

చిలుకూరు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూలో కామన్ డైట్ ప్రారంభోత్సవం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గురుకులాలల్లో చదివిన ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యారంగం పై పెట్టే డబ్బులు ఖర్చు కాదని.. అది వారిపై పెట్టే పెట్టుబడి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్ ను ప్రారంభించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో ఒకే విధమైన మెనూ అమలు చేస్తున్నారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెనూ రూపొందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరం విద్యార్థులను ద్దేశించి ప్రసంగిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి. ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలు పెంచుతామన్నారు. గురుకులాల వ్యవస్థను పీవీ నరసింహారావు హయాంలో తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇటీవలే డైట్ ఛార్జీలు పెంచారన్నారు. గురుకులాల బాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు బాగున్నాయని చెప్పారు. విద్యార్థులకు ఆరు నెలల తరువాత పుస్తకాలు ఇస్తే ఏం ప్రయోజనమని అంటూ తమ ప్రభుత్వంలో స్కూల్ ప్రారంభమైన మొదటి రోజే పుస్తకాలు అందజేస్తున్నట్టు తెలిపారు.

గురుకులాల్లో చదివిన ఓ విద్యార్థి చనిపోవడం చాలా బాధాకరం అని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. గురుకులాలు అంటే బహుముఖ ప్రతిభకు కేంద్రాలు అనే గుర్తింపు తీసుకురావాలని తమ ప్రయత్నమని చెప్పారు రేవంత్ రెడ్డి. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, మాజీ డీజీపీ మహేందర్రెడ్డి ఒకప్పటి గురుకులాల విద్యార్థులే అని చెప్పారు. వాటిలో చదివి ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారన్నారు. రెసిడెన్షియల్ స్కూల్ లో చదువుకున్న వాళ్లు ఎంతో మంది గొప్పగా రాణించారన్నారు..ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలలో సంపూర్ణ విశ్వాసం కల్పించాలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చిందని అంటూ దానికి అనుగుణంగా విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి, విద్యా ప్రమాణాలు పెంచాలన్న దృఢ సంకల్పంతో ముందుకు పోతున్నామన్నారు రేవంత్ రెడ్డి. డైట్, కాస్మోటిక్, మౌలిక వసతులకు గత ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని




ఎత్తి పొడిచారు. కాని తమ ప్రజా ప్రభుత్వం అని నిరూపించేందుకు సింగిల్ స్ట్రోక్ లో డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. పెరిగిన ధరలు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ 200 శాతం పెంచామని తెలిపారు.

రాష్ట్రంలోని 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23లక్షలు విద్యార్థులు చదువుకుంటున్నారని, అలాగే 11వేల ప్రయివేటుశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు ఉన్నారనన్నారు. ప్రయివేట్ స్కూల్స్ లో చదువు చెప్పేవారికి ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే ఎక్కు అర్హత ఉందా? అని ప్రశించారు రేవంత్ . అర్హత కలిగిన, నిష్టాతులైన ఉపాధ్యాయం వర్గం ఉన్నప్పటికీ మనం మల్టీ టాలెంటెడ్ స్టూడెంట్స్ ను ఎందుకు తయారు చేయలేకపోతున్నామని అన్నారు.. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ విషయంపై ఆలోచన చేయాలని కోరారు.

శ్రీమంతుడుకి , పేదవాడికి వారి పిల్లల పట్ల ఒకే రకమైన ప్రేమ ఉంటుందని అంటూ మనల్ని నమ్మి వాళ్ల ప్రభుత్వం హాస్టళ్లకు పంపితే మనం ఎంత బాధ్యతగా ఉండాలో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు ముఖ్యమంత్రి. గురుకుల పాఠశాలలో మరణాల వంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందదన్నారు ఇక విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పని రాష్ట్రంలోని మహిళా సంఘాలకు అప్పగించామని చెప్పారు రేవంత్.. కుట్టు పనికి ఇచ్చే రుసుం రూ.25 నుంచి రూ.75 కు పెంచామన్నారు.. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇక వారంలో రెండు,మూడు రోజులు రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు..

విద్యాసంస్థల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులలో నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగ సమస్య పెరుగుతోందని అభిప్రాయపడ్డారు ముఖ్యమంత్రి.. దీనిని అధిగమించేందుకు రాష్ట్రంలో 75 ఐటీఐ లను టాటా సంస్థతో కలిసి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేయనున్నామన్నారు.. దీంతో పాటుగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నిరుద్యోగులకు నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మన యంగ్ ఇండియా

మిగితా 3వ పేజీలో

## ద్రోణాచార్య, ఏకలవ్య కథను చెప్పిన రాహుల్ గాంధీ..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ క్రమంలోనే ద్రోణాచార్య, ఏకలవ్యుడి కథను సభలో వినిపించారు. రాజ్యాంగం గురించి మాట్లాడుతూనే మహాభారతంలోని ద్రోణాచార్యుడు, ఏకలవ్యుడి కథను రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. దేశంలో ప్రస్తుతం యుద్ధం జరుగుతోందని పేర్కొన్న రాహుల్ గాంధీ.. ఈ క్రమంలోనే మహా భారత యుద్ధంలోని ద్రోణాచార్యుడి కథను సభలో వినిపించారు. ద్రోణాచార్యుడికి.. ఏకలవ్యుడు తన బొటన వేలిని గురుదక్షిణగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అదానీకి ముంబైలోని ధారావి ప్రాజెక్టును అప్పగించినప్పుడే.. అక్కడ ఉన్న చిన్న, మధ్య తరహా వ్యాపారుల బొటనవేళ్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోసేసినట్లు అయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో అనేకమంది యువత పరిస్థితి కూడా అప్పుడు ఏకలవ్యుడికి వచ్చిన పరిస్థితే వచ్చిందని రాహుల్ గాంధీ తెలిపారు. ఏకలవ్యుడి లాగానే వేలాదిమంది యువకులు కష్టపడి విద్య నేర్చుకుం టున్నారని.. కానీ పేపర్ లీకేజీలతో యువత కష్టం బూడిదలో పోసిన పన్నీరు అవుతోందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.


తాజాగా కనీస మద్దతు ధర అడిగిన రైతులపై బాష్పవాయువు ప్రయోగించారు ఇంతకంటే దారుణం ఇంకోటి ఉంటుందా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా కులగణన చేపడతామని మరోసారి స్పష్టం చేశారు.

రాజ్యాంగంపై హిందుత్వ సిద్ధాంత కర్త వీడీ సావర్కర్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని వీడీ సావర్కర్ చెబితే ఇప్పుడు బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని రక్షిస్తామని అనడం విడ్డూరంగా ఉందన్నారు.రాజ్యాంగంలో అసలు భారతీయతే లేదనీ, దాని స్థానంలో మనుస్మృతి ఉండాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ చెప్పిన మాటలను రాహుల్ గుర్తు చేశారు.సామాజిక, ఆర్థిక సమానత్వం లేకుంటే రాజకీయ సమానత్వం ఉండదని అంబేడ్కర్ చెప్పారన్న రాహుల్, కులగణనతో సమానత్వం వైపు అడుగులేస్తామని తెలిపారు. మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారిత వివక్షను నిషేధించాలని రాజ్యాంగం చెబితే బీజేపీ మాత్రం విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని తెలిపారు. మనుస్మృతి వంటి ప్రాచీన విధానాలతోనే దేశం నడవాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు.

## వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తాం




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సంక్లిష్టమైన ఈ అంశంలో ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉందని స్పష్టం చేశారు.గ్లోబల్ ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిక, చమర్ ఇతర అనుబంధ కులాలు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు.

వర్గీకరణ అంశంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండ అమలు చేయాలన్న ఉద్దేశంతోనే అధ్యయనానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు

మిగితా 3వ పేజీలో

## అద్వానీకి అస్వస్థత



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ అగ్ర నేత అద్వానీ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఉదయం అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆయనను హుటాహుటిన ఢిల్లీలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆయన డాక్టర్ వివేక్ సూరి పర్యవేక్షణలో ఉన్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అపోలో వెల్లడించింది. రెండు నెలల కిందట కూడా అద్వానీ అనారోగ్యానికి గురికావడంతో రెండు రోజుల పాటు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. అంతకుముందు ఆగస్టులోనూ ఆయన ఎయిమ్స్‌లో చికిత్స పొందారు. తాజాగా, మళ్లీ అస్వస్థతకు గురికావడంతో అద్వానీ త్వరగా కోలుకోవాలని బీజేపీ శ్రేణులు, ఆయన అభిమానులు ప్రార్థనలు చేస్తున్నారు. ప్రస్తుతం అద్వానీ వయస్సు 97 ఏళ్లు కాగా.. ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు.

## ఉద్యమ సమయంలోని తెలంగాణ తల్లినే ఆరాధిస్తాం




- తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఉద్యమకాలం నాటి నుంచి తెలంగాణ తల్లినే తాము ఆరాధిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహాలను గ్రామ గ్రామానా ప్రతిష్టించే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ జాతికి కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వంపై శనివారం నాడు తెలంగాణ జాగృతి సంస్థ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు.


మిగితా 3వ పేజీలో

## గ్రూప్ 2 పరీక్షలకు అంతా సిద్ధం

టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం | నేడు, రేపు గ్రూప్ 2 పరీక్షలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేపు, ఎల్లుండి గ్రూప్ 2 పరీక్షలు జరుగు తాయని.. అభ్యర్థులు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై నమ్మకం ఉంచి పరీక్షలు రాయండని ఆయన చెప్పారు. ఎవరి ఓఎం ఆర్ షీట్ వారికే ఉంటుందని.. ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్ తప్పనిసరని టీజీపీఎస్సీ ఛైర్మన్ తెలిపారు. ఈసారి త్వరగానే ఫలితాలు ఇస్తామని అన్నారు. మొత్తం 1,368 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా.. 783 గ్రూప్-2 సర్వీసుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 5,51,943 మంది అప్లై చేసుకున్నారు. ఒక్కో



పేపరుకు 150 మార్కుల చొప్పున నాలుగు పేపర్లు 600 మార్కులకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఉదయం 10-12.30, మధ్యాహ్నం 3- 5.30గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి.

## ప్రభుత్వ నిర్లక్ష్యం.. గిరిజన బిడ్డకు శాపం

- ఎమ్మెల్యే హరీష్‌రావు
- నిమ్స్‌లో గురుకుల విద్యార్థినీకి పరామర్శ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థులకు శాపంగా మారిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లీలావతిని శనివారం మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలతో కలిసి హరీష్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 10న కిచిడీ తిని 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, మంచి ఆసుపత్రికి పంపకుండా హాస్టల్‌లో ఉంచి వారికి చికిత్స అందించారని చెప్పారు. నాలుగు రోజులు గడిచినా వారు పూర్తి ఆరోగ్యవంతులు కాలేదని, విద్యార్థిని లీలావతిని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. మౌనంగా ఇలా నిమ్స్ ఆసుపత్రి బెడ్‌పై ఉండటం చూస్తే మనసు కలిచివేస్తున్నదని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు

మిగితా 3వ పేజీలో




## చట్టానికి కట్టుబడి ఉంటా...

- బాధిత కుటుంబానికి అండగా ఉంటా.
- నటుడు అల్లు అర్జున్
- జైలు నుంచి విడుదల

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

చట్టానికి కట్టుబడి ఉంటానని.. పోలీసులకు సహకరిస్తానని ప్రముఖ నటుడు అల్లు అర్జున్ అన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయగా శనివారం ఉదయం జైలు నుంచి విడుదలైన ఆయన మొదటగా నగరంలోని గీత ఆర్ట్స్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటికి వచ్చారు. తాను బాగానే ఉన్నానని, ఎవరూ ఆందోళన చెందవద్దని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

"20 ఏళ్లుగా థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తున్నా. నా సినిమాలే కాదు.. మావయ్య సినిమాలూ చూశా. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. అభిమానం, ప్రేమతో అండగా నిల్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నేను బాగున్నాను.. ఎవరూ ఆందోళన చెందవద్దు. బాధిత కుటుంబానికి మరోసారి సానుభూతి తెలుపుతున్నా. నేను సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు అనుకోకుండా ఘటన జరిగింది. ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు. బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తాను, వారికి పూర్తిగా ఆర్థికంగా అండగా ఉంటా. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకన్నా ఎక్కువ మీడియాతో మాట్లాడలేను. నాకు సహకరించిన మీడియా మిత్రులకు, కుటుంబ సభ్యులకు, బంధువులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని అన్నారు.

## విద్యార్థుల పట్ల బాధ్యత రహితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు

- అన్ని హాస్టళ్లలో ఒకే తరహా భోజనం.
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

ప్రభుత్వానికి చెందిన అన్ని హాస్టళ్లలో విద్యార్థులందరికీ ఒకే తరహా భోజనం అందించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, టీచర్లు విద్యార్థులను సరిగా పట్టించుకోకుండా, బాధ్యత రహితంగా వ్యవహరిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న న్యూ కమాన్ డైట్ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ స్కూల్(గర్ల్స్ మానాల) లో రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, బియ్యం కూరగాయలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో కామన్ డైట్ మెనూ ను ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సరదాగా నృత్యాలు చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా గురుకులాల్లో చదువుతున్న ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ హాస్టల్ లలో బలమైన ఆహారాన్ని అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంత్రులు ,ఎమ్మెల్యేలు హాస్టల్ లలో సందర్శిస్తున్నారని అన్నారు. గురుకులాల్లో చదువుతున్న 8 లక్షల మంది విద్యార్థులకు బలమైన ఆహారం అందించాలని నిపుణులైన డాక్టర్ ల సమక్షంలో డైట్ మెనూ ఏర్పాటు ప్రభుత్వం చేసిందని అన్నారు . రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకాల్లో ఒకే రకమైన డైట్ ను ప్రారంభం చేశామని,రాష్ట్రంలో ఒక పండుగ వాతావరణం లో నేడు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు.

మన ఇంట్లో పిల్లలకు ఏ విదంగా ఆహారం అందిస్తున్నామో ప్రజా ప్రభుత్వంలో గురుకులల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందజేయడం జరుగుతుందని,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పిల్లలు దాగివున్న ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సాహం అందించాలని అన్నారు.

పాఠశాలలోనే 15 మంది విద్యార్థులను ఒక గ్రూపుగా తీసుకొని వారికి సబ్జెక్టుల వారీగా రివ్యూలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ప్రత్యేక ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తుందని,గతంలోనే ఐటిఐ లను ఏటీసీలుగా అప్డేట్ చేయడం జరిగిందని,త్వరలోనే 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందనిఅన్నారు . విద్యార్థులను సరిగా పట్టించుకోకుండా బాధ్యత రహితంగా ప్రవర్తిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందనిఅన్నారు..

ప్రజా ప్రభుత్వంలో గురుకులాల్లోని పిల్లలను తమ ఇంటి పిల్లలుగా భావించి వారికి పౌష్టికారమైన ఆహారం నాణ్యమైన భోజనం అంద చేయడం జరుగుతుందనిఅన్నారు . అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామనిఅన్నారు .

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచామని,గతంలో



మూడు నుంచి ఏడవ తరగతి వరకు రూ. 950 డైట్ చార్జీలు ఉండగా, నేడు రూ. 1330గా ,8 నుంచి 10 వ తరగతి వరకు రూ.1100 ఉండగా నేడు రూ. 1540, ఇంటర్ నుండీ పీజీ వరకు రూ. 1500 ఉండగా నేడు రూ.2100 ప్రభుత్వం పెంచిందనిఅన్నారు . గతంలో ఉన్న కాస్మొటిక్ చార్జీలను మూడు నుంచి ఏడవ తరగతి వరకు కాస్మొటిక్ చార్జీలు 55 ఉండగా నేడు 175గా ,8 నుండీ 10 వ తరగతి వరకు 75 ఉండగా నేడు 275 కు పెంచడం జరిగిందన్నారు.రాబోయే కాలంలో ఆరోగ్యంగా ఉంటూ మానసికంగా బలంగా ఉంటూ తెలంగాణ అభివృద్ధిలో విద్యార్థులంతా భాగస్వామ్యులు కావాలని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం రాగానే 2 లక్షల రూపాయల రుణమాఫీ చేశాం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ అందిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకూ 120 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారాని, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం,కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నామని అన్నారు .మన ప్రాంతంలో రుద్రంగి మండల కేంద్రానికి నూతన ఏటీసీ సెంటర్ మంజూరు చేయడం జరిగిందని, ఏటీసీల్లో చదివిన విద్యార్థులకు భవిష్యత్తులో స్కిల్స్ పెంపొందించడంతోపాటు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయనిఅన్నారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,తహసిల్దార్ మహేశ్, సీఐ వీరప్రసాద్,మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కానికరపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ..

- ముగ్గురికి తీవ్ర గాయాలు.


**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

ఆర్టీసీ బస్సు బైక్ ఢీ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది.వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామానికి చెందిన దంపతులు బానోతు ప్రకాష్ కవిత రెండు సంవత్సరాల కుమారుడు శివ తో బైక్ పై సిరిసిల్ల వెళ్తుండగా ఎల్లారెడ్డిపేట కొత్త బస్టాండ్ లో వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనకాల ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రకాష్ మొహానికి బలమైన గాయాలు కాగా, భార్య కవిత ఎడుమ భుజం విరగగా, కుమారుడు శివకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు పక్కనే ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కొత్త బస్టాండ్ లో ఆర్టీసీ బస్సులు వెళ్లేటప్పుడు కామారెడ్డి సిరిసిల్లకు వెళ్లే వాహనదారులకు రోడ్డు మధ్యలో తల్లి బిడ్డ విగ్రహం ఉండడంవల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఆర్ అండ్ బి అధికారులు వెంటనే చొరవ తీసుకొని తల్లి బిడ్డ విగ్రహాన్ని తొలగించాలని వాహనదారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 100 రోడ్డు ప్రమాదాలు ఈ విగ్రహం వద్ద జరిగినట్లు తెలిపారు.




## పోలీస్ శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం పాత్ర కీలకం..

- క్రమశిక్షణతో కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానంలో ఉంటారు..
- ఎస్పీ అఖిల్ మహాజన్.



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

పోలీస్ శాఖలో ఆర్మడ్ రిజర్వ్ విభాగం పాత్ర కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా అర్మడ్ హెడ్ క్వార్టర్స్ లో సాయుధ ధళ పోలీసుల సమీకరణ కవాతుకి ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై,గౌరవ వదనం స్వీకరించినారు.అనంతరం ఆర్మడ్ హెడ్ క్వార్టర్స్, ఆర్ఐ అడ్మిన్ కార్యాలయం,ఆర్ఐ హెూమ్ గార్డ్,రికార్డ్స్, బెల్లఫ్ ఆర్మ్స్, బీడీ టీమ్,డాగ్ స్క్వాడ్ లను ఆర్ఐ ఎం టీ వో కార్యాలయం తనిఖీ చేసారు.అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఆర్మడ్ రిజర్వ్ పాత్ర కీలకంమని,ఆర్మడ్ సిబ్బంది ఆర్మడ్ డ్యూటీలే కాకుండా సివిల్ సిబ్బందికి సహాయంగా శాంతి భద్రతల పరిరక్షణలో విధులు చేస్తున్నారన్నారని అన్నారు .క్రమశిక్షణతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకరవలన్నారని,సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలన్నారు. క్రమశిక్షణ తో కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానం లో ఉంటారన్నారని,సిబ్బంది శారీరకంగా ,మానసికంగా దృఢంగా ఉండటానికి నిత్యా జీవితంలో యోగ,వ్యాయామం ఒక భాగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, ఆర్ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు..

## ఒత్తిడి నుంచి దూరం కావడానికి యోగా, మెడిటేషన్ అలవర్చుకోవాలి..

- విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

విద్యార్థుల ఆరోగ్యం,ఎదుగుదలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిపేట మండలం దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో కామన్ డైట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రతి హాస్టల్లో ఒకే రకమైన భోజనం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కామన్ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. గతంలో ఉన్న



డైట్ చార్జీలు 8 సంవత్సరాల తర్వాత 40 శాతం ప్రస్తుత ప్రభుత్వం పెంచిందని, కాస్మొటిక్ చార్జీలను 16 సంవత్సరాల తర్వాత 200 శాతం పెంచిందన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థుల ఎదుగుదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తుదన్నారు.

విద్యార్థిని విద్యార్థులు చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధనకు నిరంతరం కష్టపడాలని అన్నారు .కష్టపడితే ఏదైనా సాధించవచ్చని అందరూ తమ లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని అన్నారు .విద్యార్థులు ఒత్తిడి నుండి దూరం కావడానికి యోగ మెడిటేషన్ వంటివి అలవర్చుకోవాలి, విద్యార్థి దశలో సోషల్ మీడియా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని, వాటి వలన జీవితాలు నాశనం అవుతాయన్నారు.

అనంతరం పాఠశాలలోని విద్యార్థులు,వారి తల్లిదండ్రులతో కలిసి ఎస్పీ అఖిల్ మహాజన్ భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృదం, ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు..

## క్రీడలు సేవా భావాన్ని పెంపొందిస్తాయి



- ఉత్సాహంగా సాగిన ఫ్రెండ్లి పోలీస్ క్రికెట్ మ్యాచ్..

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

క్రీడలలో పాల్గొనడం ద్వారా స్నేహభావం పెంపొందుతుందని, పని ఒత్తిడి నుండి కొలుకోవడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని బైపాస్ ప్రాంతంలో ఉన్న మైదానంలో జిల్లా పోలీస్ అధికారులు క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. ఈ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ను ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు.ఓజట్టుకు ఎస్పీ అఖిల్ మహజన్ , మరో జట్టు కు సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వం వహించగా,మొదటగా బ్యాటింగ్ చేసిన సిరిసిల్ల డిఎస్పీ టీం 15 ఓవర్లకు గాను 4 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఎస్పీ టీం నిర్ణీత 15 ఓవర్లలో 4 వికెట్స్ ను కోల్పోయి 102 పరుగులు చేసింది. దీంతో సిరిసిల్ల డిఎస్పీ టీం విజయం సాధించింది.ఈ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,బెస్ట్ బ్యాట్స్ మెన్,బెస్ట్ బౌలర్ అవార్డ్ వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ రాజు కి ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి అఖిల్ మహాజన్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని నిత్యం బిజీగా ఉండే పోలీసులు కొంత సేపు ఆహ్లాదకరంగా గడిపారు అని అన్నారు. క్రికెట్ మ్యాచ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆటవిడుపు తో పాటు మంచి టీమ్ స్పిరిట్ వస్తుందని, మన యొక్క ఫిట్ నెస్ పైన ఒక కాన్ఫిడెన్స్ వస్తుందనిఅన్నారు . ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు చంద్రశేఖర్ రెడ్డి, మురళి కృష్ణ, సిఐ లు కృష్ణ,శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్ బీ సి.ఐ శ్రీనివాస్, ఆర్ఐ లు మధుకర్, రమేష్, ఎస్ఐ లు ఆర్.ఎస్.ఐ లు పాల్గొన్నారు..



## కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవం

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

ఇందిరమ్మ కాలనీలోని రెసిడెన్షియల్ గిరిజన పాఠశాలలో డైట్ కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వసతి గృహంలో పరిసర ప్రాంతాలను సందర్శించి డైట్ కాస్మోటిక్ పెంపును ప్రారంభించి విద్యార్థులను మధ్యాహ్నం భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులకు వైద్యం ఎలా అందిస్తున్నారో తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో సిరిసిల్ల వైస్ చెర్మెన్ నెరేళ్ల నర్సింగం గౌడ్, తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలగం ప్రవీణ్ టోనీ రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గడ్డం మధుకర్ చోటు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, కొంపెల్లి శ్యామ్, మిరాల శ్రీనివాస్ యాదవ్ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## లింగన్నపేటలో సువర్ణ భారతి పాదక పూజ..

**బలగం టీవీ, గంభీరావుపేట**

లింగన్నపేట గ్రామంలో సువర్ణ భారతి పాదక పూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నామని వ్యాసోర్భుల రామశర్మ,వ్యాసోర్భుల రాధాకృష్ణ తెలిపారు. గంభరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దక్షిణామ్నాయ శృంగేరి శ్రీ శారదా పీఠ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు సన్యాసం స్వీకరించి నేటికి 50వ వసంతం సందర్భంగా అది వారం లింగన్నపేట గ్రామంలోని హరిహర దేవాలయం సువర్ణ భారతి పాదక పూజ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆదివారం సాయంత్రం 05 గంట లకు పాదుకా ఊరేగింపు, రాత్రి 7 గంటలకు గురు ప్రార్థన, గోపూజ, గణపతి పూజ, వేద స్వస్తి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి పాదక పూజ కార్యక్రమానంతరం అన్న ప్రసాద వితరణ చేయబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## విద్యార్థులకు విద్యతో పాటు పౌష్టికాహారం తప్పనిసరి

- డిప్యూటీ కలెక్టర్ రాధా భాయి



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతనంగా తీసుకువచ్చిన కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ వేడుకని నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాలకి ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్ రాధా భాయి హాజరయ్యారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు.విద్యార్థినులకు అందించే పౌష్టికాహార మెనూ ని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడవ తరగతి నుండి పీజీ స్థాయి వరకు గల హాస్టల్స్ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకై డైట్ చార్జీలను 40% కి పెంచారని, గతంలో ఈ చార్జీలు1500గా ఉండేవని ప్రస్తుతం 2100 కు పెరిగాయని తెలిపారు.అలాగే కాస్మోటిక్ చార్జీలను గతంలో లేని విధంగా 200% కంటే ఎక్కువగా పెంచారనీ దీనితో గతంలో 75 రూపాయలుగా ఉండే కాస్మోటిక్ ఛార్జ్ 275 రూపాయలకు పెరిగాయని తెలియజేశారు. విద్యార్థులు శారీరకంగా మానసికంగా బలంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరి అని గుర్తించిన ప్రభుత్వం రాగి జావా, పల్లిపట్టి, మునగాకు పప్పు, మటన్ వంటి పౌష్టికాహారాలతో మెనూ సిద్ధం చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెహనా ఇఫ్ఫత్ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికరమైన ఆహారం కూడా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని కళాశాలలోనే సహపంక్తి భోజనాలు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలి



- ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి..
- టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాథ్ రెడ్డి

**బలగం టీవీ , సిరిసిల్ల**

సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలని టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాద్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాజన్న సిరిసిల్ల కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాద్ రెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీపిటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమానాద్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు అయిన పే స్కేల్, జీవిత భీమా , హెల్త్ కార్డులు, సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులకు ఇతర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు ప్రభుత్వం వెంటనే ప్రకటించి వారి జీవితాలలో ఆనందాలు, వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు చాలీచాలని వేతనంతో అత్యంత దుర్భర పరిస్థితులలో జీవనం గడుపుతున్నారని, వారికి పే స్కేల్ ప్రకటించి అందిస్తే వారు ఆనందంగా వారి వృత్తి నిర్వహణలో ప్రభుత్వానికి, ఇటు ఉపాధ్యాయులకు మధ్య వారధిగా ఉంటూ కార్యనిర్వహణలో అంకితభావంతో పాల్గొంటారని అన్నారు.సమగ్రశిక్ష ఉద్యోగులు లేకపోతే విద్యాశాఖ లోని అన్ని కార్యక్రమాలు కుంటుపడతాయని, విద్యార్థులకి సంబంధించిన డేటా అప్లోడ్స్, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు మరియు మండల వనరుల కేంద్రంలో అన్ని రకాల పనులు ఆగిపోతున్నాయని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేకుండా, కనీసం పనికి తగ్గ వేతనం లేకుండా వెట్టి చాకిరి చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారన్నారని అన్నారు.

కాబట్టి ఉద్యోగ సంక్షేమం దృష్ట్యా ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వారికి కనీస వేతనంతో ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండగా ప్రభుత్వం ఉపాధ్యాయులతో వారి పని చేపించుకోవాలని చూడటాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు కూడా సమగ్ర శిక్ష ఉద్యోగులు మన మిత్రులేనని గుర్తించి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుకోవడానికి,మన వంతు సహకారం అందించాలని సూచిస్తూ వారికి సహకరించాలని కోరారని అన్నారు.

## కష్టపడి చదువుతేనే ఉన్నత శిఖరాలకు చేరుతారు

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**బలగం టీవీ , సిరిసిల్ల**

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదువుతేనే ఉన్నత శిఖరాలకు చేరుతారని, గొప్ప స్థాయిలో ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు విజయతీరాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాలలోని టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ లో చేపట్టిన కామన్ డైట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణలోని కిచెన్, స్టోర్ రూం, తరగతి గదులు పరిశీలించారు. కిచెన్, స్టోర్ రూంలోని ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అలాగే నూతన డైట్ మెనూ ప్రారంభించి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులకు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ సీడీఓ విజయ లక్ష్మి, గురుకుల కో ఆర్డినేటర్ థెరిసా, తహసిల్దార్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# కులగణన 98 శాతం పూర్తి



**• సీఎం రేవంత్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జనాభా ప్రాతిపదికన ఫలాలు అందాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన 98 శాతం మేరకు పూర్తయిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. మిగిలిన రెండు శాతం పూర్తయితే దేశానికే ఆదర్శంగా నిలిచే ఈ కులగణన తెలంగాణ ప్రజల మెఘా హెల్త్ ప్రొఫైల్‌గా మారుతుందని అన్నారు.

హైదరాబాద్‌లో నిర్మించిన కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ – దొడ్డి కొమురయ్య ఆత్మ గౌరవ కురుమ భవనానికి ముఖ్యమంత్రి శనివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య పోరాటాలను స్మరించుకున్నారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డుకర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. చాకలి ఐలమ్మ పేరును యూనివర్సిటీకి పెట్టినట్టుగానే, దొడ్డి కొమురయ్యని శాశ్వతంగా గుర్తుండిపోయేలా మంత్రివర్గ సహచరులతో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు.

దొడ్డి కొమురయ్య భవన ప్రాంగణం ఒక విద్యా వేదిక కావాలి. విజ్ఞానం పంచాలి. కురుమ సోదరులకు విద్య కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రుణమాఫీ, వరికి బోనస్, ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్, పేదలకు వైద్య సౌకర్యాలు అందించడం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కువగా బలహీన వర్గాలకు అందాయని చెప్పారు. తెలంగాణకు జమిందారుల తల్లి కాదు. బహుజనుల తెలంగాణ తల్లి ఉండాలి. ఏ తల్లి అయితే మన అమ్మ లాగా ఉంటుందో, అడక్కుండానే మన ఆకలిని గుర్తించి బుక్కెడు అన్నం పెడుతుందో అలాంటి తెలంగాణ తల్లిని తెచ్చుకున్నాం.

మన అమ్మకు ప్రతిరూపం. మన అక్కకు ప్రతిరూపం. ఒకపక్క వరి, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న వంటి తెలంగాణలో పండించే పంటతో పాటు నా బిడ్డలు చల్లంగా ఉండాలి. నా బిడ్డలు శాశ్వతంగా అభివృద్ధి పథంవైపు నడవాలని ఆశీర్వదించే తెలంగాణ తల్లిని మనం ప్రతిష్ఠించుకున్నామని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ గారు మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం గారు, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు, కర్నాటక రాష్ట్ర మాజీ మంత్రి హెచ్ ఎం రేవణ్ణ గారు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో చదివి ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారు

(మొదటి పేజీ తరువాయి)

స్కిల్స్ యూనివర్సిటీ దేశానికే ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దుతామని అన్నారు%ా.. 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించిన వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో నిఖత్ జరీన్, సిరాజ్ లాంటి వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు.. విద్యార్థులలో ఉన్న క్రీడా ప్రతిభను కూడా వ్యాయమ ఉపాధ్యాయులు గుర్తించి వారిని పొత్సహించాలని కోరారు. సమావేశం ముగిసిన అనంతరం రేవంత్ రెడ్డి విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

# ఉద్యమ సమయంలోని తెలంగాణ తల్లినే ఆరాధిస్తాం

**• తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉద్యమకాలం నాటి నుంచి తెలంగాణ తల్లినే తాము ఆరాధిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహాలను గ్రామ గ్రామానా ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ జాతికి కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వంపై శనివారం నాడు తెలంగాణ జాగృతి సంస్థ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు.

ఈ సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... సమావేశంలో వచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా పలు తీర్మానాలు ఆమోదించామని చెప్పారు. ఆమోదించిన తీర్మానాలు: "ఒక చేతిలో జొన్నకర్ర, మరొక చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవంపై పద్యాలు, కవితలు రచించి పుస్తకాలు వెలువరిస్తాం. పిల్లలు వాడే నోట్ బుక్స్, రైటింగ్ ప్యాడ్స్ అన్నింటిపై తెలంగాణ తల్లిని ముద్రించి పిల్లలకు ఇచ్చే ప్రయత్నం చేస్తాం. తెలంగాణ తల్లికి ఆరాధానతో కార్యక్రము మొదలుపెట్టే సంప్రదాయాన్ని ఇకముందూ కొనసాగిస్తాం. ప్రస్తుతం రేవంత్ రెడ్డి రూపొందించిన విగ్రహానికి కాంగ్రెస్ మాతగా నామకరణం చేస్తూ తీర్మానం."

మన సంస్కృతిపై దాడి జరుగుతుంటే ప్రతీ ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి రూపం మార్చారని విమర్శిం చారు. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుక మ్మను చూస్తే తెలంగాణ సమాజాన్ని చూసినట్లుంటుందని అన్నారు. "అందరం కలిస్తేనే ఒక అందమైన బతుకమ్మ అవుతుం ది... అందరం కలిస్తేనే అందమైన సమాజం

అవుతుందన్న సందేశం ఇచ్చేది బతుకమ్మ. అలాంటి బతుకమ్మ తెలంగాణ తల్లి చేతిలో లేకపోతే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృధ్భావం ఎలా కనిపిస్తుంది ?" అని ప్రశ్నించారు. మన అస్తిత్వాన్ని దెబ్బతీసే ధైర్యం ఎవరికీ లేదని, కానీ అటువంటి ప్రయత్నాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అవసరం మనకు ఉందని స్పష్టం చేశారు. ఉనికి, సంస్కృతిపై దాడి జరుగుతుంటే మాట్లాడకపోతే చరిత్ర మనల్ని క్షమించదని చెప్పారు.

తెలంగాణ ఉధ్యమంలో, తెలంగాణ పునర్నిర్మాణంపై రేవంత్ రెడ్డి ఎక్కడా లేరని గుర్తు చేశారు. తెలంగాణ పునర్నిర్మాణ సమయంలో రేవంత్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేశారని, ఉద్యమకాలంలో ఉద్యమకారులపై తుపాకి ఎక్కిపెట్టిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని ధ్వజమెత్తారు.

బతుకమ్మ పూర్తిగా బహుజన కులాల పండుగ అని, అగ్రవర్గాల పండుగ కానేకాదు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణపై జరిగిన దాడి కన్న ఇప్పుడు ఎక్కువగా జరుగుతోందని, కొంత మందిలో ఇంకా సమైక్యవాదపు పోకడలు పోలేదని ఆరోపించారు. ఇది కేవలం తెలంగాణ తల్లిపై దాడి కాదని, మలిదశ తెలంగాణ ఉద్యమ చరిత్రను చెరిపివేయాలన్నది రేవంత్ రెడ్డి కుట్ర అని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి కనీసం జై తెలంగాణ అనడమే ఇష్టం లేదని, పొరపాటున ఒక్కసారి కూడా జై తెలంగాణ అని సీఎం అనడం లేదని విమర్శించారు. తెలంగాణ అమరుల స్థూపం వద్దకు కూడా సీఎం రేవంత్ రెడ్డి వెళ్లడం లేదని చెప్పారు. చార్మినార్ ను, కాకతీయ కళాతోరణాన్ని రాచరిక చిహ్నాలని సీఎం అనడం సరికాదని సూచించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమం చేయడానికి ప్రేరేపించింది తెలంగాణ తల్లి అని, తెలంగాణ తల్లి కోదండరాంను జేఏసీ చైర్మన్ ను చేసింది, కేసీఆర్ ను నాయకుడిని చేసిందని వివరిం చారు. అందరి గుండెల్లో ముద్రించుకొని ఉన్న తెలంగాణ తల్లిని మార్చడం దారుణమని అన్నారు. రేవంత్ రెడ్డి కిరీటం పెట్టుకోవచ్చుటా కానీ తెలంగాణ తల్లికి మాత్రం కిరీటం ఉండవద్దా ? అని ప్రశ్నించారు. ప్రాచీన శిల్ప సంపద నుంచి పుట్టింది తెలంగాణ తల్లి అని వివరించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ...శిల్ప శాస్త్రం ప్రకారం కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేయించారని తెలిపారు.

# వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

దామోదర రాజనర్సింహా , పొన్నం ప్రభాకర్ , ధనసరి సీతక్కతో కూడిన సబ్ కమిటీ ని నియమించిన విషయాన్ని గుర్తుచేశారు.

అలాగే, వర్గీకరణ అంశంపై 60 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కోరుతూ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శమీమ్ అఖ్తర్ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్ ను నియమించామని, మరో వారం రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ చేస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. రాజకీయ, అధికార నియామకాల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. చరిత్రలో తొలిసారి ఓయూ వీసీగా మాదిగను నియమించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం.. గిరిజన బిడ్డకు శాపం



(మొదటి పేజీ తరువాయి)

శాపంగా మారిందని, తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నదని హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థులకు చికిత్స అందించడంలో జరిగిన వైఫల్యం ఇక్కడ కనిపిస్తున్నదని చెప్పారు. మొన్న శైలజ మృతికి ప్రభుత్వం కారణం అయ్యిందని మండిపడ్డారు.

ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు..? అని నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాదు, కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ అభం శుభం తెలియని విద్యార్థులకు శాపం అవుతున్నదని, ప్రాణాలను బలిగొంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి, ఎస్సి ఎస్టి మంత్రి కూడా రేవంత్ రెడ్డి అని, ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల నిర్వహణలో వైఫల్యం చెందారని విమర్శించారు. చూడడానికి వెళ్తే ప్రతిపక్ష నాయకులను అడ్డుకుంటారని, సబితా ఇంద్రా రెడ్డిని, సత్యవతి రాథోడ్‌ను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంపై ఉన్న ధ్యాస, కనీసం జిల్లాలో ఉన్న పిల్లల భవిష్యత్తుపై లేదా..? అని సిఎంను ప్రశ్నించారు.

ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు అని హరీష్‌రావు మండిపడ్డారు. సంక్షేమ పాఠశాలలను సంక్షోభ పాఠశాలలుగా మార్చారని అన్నారు. తాము ప్రశ్నిస్తే వార్డెన్లు, ప్రిన్సిపల్స్ మీద చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారని పేర్కొన్నారు. నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడం లేదు, సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే గురుకులాల మొక్కుబడి సందర్శన కాకుండా, ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని చెప్పారు. ఫోటోలకు పోజులు ఇవ్వడం కాదు–, పట్టెడు పనికొచ్చే బువ్వ పెట్టి పొట్టలు నింపాలని అన్నారు. ఫుడ్ పాయిజన్ జరిగిన తర్వాత విద్యార్థులకు సకాలంలో చికిత్స అందించకపోవడం వారి ప్రాణాల మీదకు వస్తున్నదని, ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల ప్రాణాలు బలిగొంటున్నాదని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సిఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రచారం కోసం కాకుండా పిల్లల భవిషత్తు కోసం ఆలోచించాలని కోరారు. చలికాలంలో విద్యార్థులు వణుకుతున్నారు..వేడి నీళ్ళు లేవు..వారికి బట్టలు కూడా ఇవ్వలేదు, ఆ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. హాస్టల్‌లో పని చేసే సిబ్బంది జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. గ్రీన్ ఛానెల్ ఉంటే ఆరు నెలలుగా హాస్టళ్లకు ఎందుకు డబ్బులు ఇవ్వటం లేదని అడిగారు. ఇప్పటి వరకు లీలావతికి ప్రభుత్వం నుండి ఎలాంటి మద్దతు లభించ లేదని, వారి తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. లీలావతి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మిగతా విద్యార్థులను అవసరం అయితే నిమ్స్ తరలించి మంచి వైద్యం అందించాలని కోరారు.

# సాహితీ ఉద్యమంలో కవిత నందిని సిధారెడ్డిది కీలక పాత్ర

**• కేటీఆర్**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సాహితీ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కవి, రచయిత నందిని సిధారెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రభు త్వం ప్రకటించిన రూ.కోటి నగదు పారితోషకం, ప్లాట్‌ను తిరస్కరించడం తెలంగాణ అస్థిత్వ పరిరక్షణలో ఓ మైలురాయిగా నిలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ అస్థిత్వ పరిరక్షణలో సిధారెడ్డి చూపిన నిబద్ధత, తెగువ తెలంగాణ చరిత్రలో చిరకాలం నిలిచి ఉంటుంన్నారు. అల్వాల్‌లోని నివాసంలో జరిగిన సమావేశంలో కేటీఆర్, సిధారెడ్డితో ఉద్యమకాల స్మృతులను నెమరేసుకున్నారు. ప్రభుత్వమే తెలంగాణ అస్థిత్వంపై కుట్రలు చేస్తున్న ఈ తరుణంలో తెలంగాణ సమాజానికి నందిని సిధారెడ్డి గట్టి సందేశం పంపారన్నారు.

## భారతీయ సినిమాకు రాజ్‌కపూర్ ఎనలేని సేవలు



**బలగం టీవీ, అమరావతి**

భారతీయ సినిమాకు రాజ్‌కపూర్ అందించిన సేవలు ఎనలేనివని ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్‌కల్యాణ్ అన్నారు. రాజ్‌కపూర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదిక ద్వారా నివాళి అర్పించారు.‘ ది షోమ్యాన్ ఆఫ్ ఇండియన్ సినిమా’ గుర్తింపు పొందిన రాజ్‌కపూర్ భారతీయ సినిమాకు అందించిన అపారమైన సేవలకు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. తన అసాధారణమైన నటనతో హిందీ చిత్ర పరిశ్రమను పునర్నిర్మించారని తెలిపారు. మూడు జాతీయ అవార్డులు, 11 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సొంతం చేసుకుని అంతర్జాతీయ గుర్తింపు పొందారని కొనియాడారు. అతని టైమ్‌లెస్ క్లాసిక్ ‘ ఆవారా’ మూవీ నేటికి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తూనే ఉందని తెలిపారు. కపూర్ కుటుంబం రాజ్‌కపూర్ వారసత్వాన్ని నిలబెట్టిందని కొనియాడారు.




## ‘బచ్చల మల్లి’ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు అల్లరి నరేష్ కథానాయకుడిగా నటిస్తున్న బచ్చల మల్లి’ సినిమా డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మూవీ నుంచి తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తుండగా.. హాస్యా మూవీస్ పతాకంపై రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతాన్ని సమకూర్చనున్నాడు. ఇందులో నరేష్‌కి జోడీగా అమృత అయ్యర్ కనిపించనుంది. 1990 నేపథ్యంలో సాగే ఈ కథలో నరేష్ మాస్ అవతార్‌లో కనిపించబోతున్నాడు. తుని ప్రాంతంలో జరిగిన కొన్ని యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు.

## హాలీవుడ్ నటుడితో మంచు విష్ణు భాగస్వామ్యం



**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు మంచు విష్ణు తరంగ వెంచర్స్ పేరుతో మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ టెక్నాలజీ రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. అయితే 50 మిలియన్ డాలర్ల నిధులతో ఏర్పాటు చేస్తున్న ఈ సంస్థలో హాలీవుడ్ ప్రముఖ నటుడు విల్‌స్మిత్ కూడా భాగస్వామి అయ్యేందుకు సిద్ధంగా ఉండటం ఇప్పుడు చర్చనియాంశమైంది. ఈ విషయాన్ని మంచు విష్ణు తెలిపారు. దీనికి సంబంధించిన చర్చలు చివరి దశలోకి వచ్చినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ విషయానికి సంబంధించి శుభవార్త వింటారని పేర్కొన్నారు. తరంగ వెంచర్స్, వినోద రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోనుంది. ఇండస్ట్రీకి అవసరమయ్యే కొత్త టెక్నాలజీస్‌పై పెట్టుబడులు పెట్టనుంది. ఓటీటీ వేదికలు, యానిమేషన్, గేమింగ్, బ్లాక్ చెయిన్, సరికొత్త టెక్నాలజీలైన ఏఆర్, వీఆర్, ఏఐ వంటి సాంకేతికతకు సంబంధించిన సేవలను అందించనుంది.

ఈ తరంగ వెంచర్స్‌లో మంచు విష్ణు, ఆది శ్రీ, ప్రద్యుమన్ ఝూలా, వినయ్ మహేశ్వరి, విల్‌స్మిత్, దేవేష్ చావ్లా, సతీష్ కటారియాలు భాగస్వాములుగా ఉన్నారు. వీరే కాకుండా మరికొందరు కూడా తరంగ వెంచర్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది.

# మొదటి రోజు వరుణుడిదే..

- బ్రిస్బేన్‌లో ఎడతెరిపిలేని వర్షం..
- తొలిరోజు కేవలం 13.2 ఓవర్ల ఆట
- ఆస్ట్రేలియా 28/0







**బలగం టీవీ, బ్రిస్బేన్**

బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా భారత్ ఆస్ట్రేలియా మధ్య బ్రిస్బేన్ గబ్బా స్టేడియంలో మూడో టెస్ట్ శనివారం మొదలైంది. అయితే వర్షం కారణంగా తొలిరోజు కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖవాజా 19 పరుగులతో, నాథన్ మెక్స్వీనీ నాలుగు పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. మ్యాచ్ మొదలయ్యాక తొలిసారి 5.3 ఓవర్ల సమయంలో వర్షం కురిసింది. దాంతో దాదాపు 20 నుంచి 25 నిమిషాల వరకు మ్యాచ్ ఆగిపోయింది. మళ్లీ 13.2 ఓవర్ల వద్ద మరోసారి వర్షం మొదలుకావడంతో ఆటను నిలిపివేయాల్సి వచ్చింది. ఆ తర్వాత మ్యాచ్‌కు వాతావరణం అనుకూలించలేదు. తొలిరోజు మ్యాచ్ వర్షార్పణం కావడంతో రెండోరోజు 98 ఓవర్ల వేయనుండగా.. మ్యాచ్ నిర్ణీత సమయానికంటే అరగంట ముందే మొదలుకానున్నది. అంటే రెండో రోజు మ్యాచ్ భారత కాలమానం ప్రకారం.. ఉదయం 5.20 గంటలకు ప్రారంభం కానున్నది.

గబ్బా వేదికగా మొదలైన మూడో టెస్ట్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా రెండు మార్పులు చేసింది. రవిచంద్రన్ అశ్విన్, హర్షిత్ రాణాను పక్కనపెట్టి.. రవీంద్ర జడేజా, ఆకాశ్ దీప్‌కు తుదిజట్టుల్లో ఛాన్స్ ఇచ్చింది. అదే సమయంలో ఆస్ట్రేలియా జట్టు స్కాట్ బోలాండ్ స్థానంలో జోష్ హేజిల్‌వుడ్‌ని తీసుకున్నది.



## నేనే మీడియాను లోపలికి తీసుకెళ్లా

- మంచు మనోజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

జల్ పల్లిలోని మంచు మోహన్ బాబు ఫాంహౌస్ లో ఇటీవల మీడియా ప్రతినిధులపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మంచు మనోజ్ స్పందించారు. ఫాంహౌస్ లోపలికి దూసుకు రావడంతో మీడియా ప్రతినిధులపై దాడి జరిగిందన్న ప్రచారాన్ని కొట్టిపారేశారు. మీడియా ప్రతినిధుల తప్పేమీలేదని, తానే వారిని లోపలికి తీసుకెళ్లానని స్పష్టతనిచ్చారు. తన ఏడు నెలల కూతురును తెచ్చుకోవడానికి ఫాంహౌస్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారని చెప్పారు. గేట్లు మూసేసి తనను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని వివరించారు. దీంతో తాను గేట్లు పగలకొట్టి మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని లోపలికి వెళ్లానని చెప్పారు. ఇంతలో సడెన్ గా తన తండ్రి, ఇతరులు వచ్చి తమపై దాడి చేశారని చెప్పారు. ఈ క్రమంలోనే ఓ రిపోర్టర్ కు తీవ్ర గాయాలయ్యాయని మనోజ్ వివరించారు.

## నేను ఎప్పటికీ నీ అభిమానినే

- రానాకు సమంత బర్త్‌డే విషెస్



**బలగం టీవీ, హైదరాబాద్**

రానా దగ్గుబాటి పుట్టినరోజు సందర్భంగా స్టార్ నటి సమంత రానాకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. ‘హ్యాపీ బర్త్ డే రానా. నువ్వు చేసే ప్రతి పనిలోనూ వంద శాతం ఫోకస్ పెడుతుంటావు. ఈ విషయంలో నీ నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. నేను ఎప్పటికీ నీ అభిమానినే. దేవుడు ఆశీర్వాదులు నీకు ఎప్పుడూ ఉండాలి’ అంటూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.




### డాకు మహారాజ్ నుంచి

## మొదటి సింగిల్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘డాకు మహారాజ్’ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని దర్శకుడు బాబీ కొల్లి డైరెక్ట్ చేస్తుండగా పూర్తి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతుంది.తాజాగా ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సాంగ్ ఆద్యంతం పవర్‌ఫుల్ మ్యూజిక్‌తో ఆడియెన్స్‌ను ఆకట్టుకుంది. థమన్ అందించిన సంగీతం ఈ సాంగ్‌ను ఇన్‌స్టంట్ చార్ట్ బస్టర్‌గా మార్చేసింది. అనంత్ శ్రీరామ్ ఈ పాటకు లిరిక్స్ అందించగా నకాశ్ అజీజ్, భరత్ రాజ్, రితేజ్ జి రావు, ప్రణతి పాడారు. ఈ సినిమాలో బాలకృష్ణతో పాటు ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి, బాబీ డియోల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని నాగవంశీ, సాయి సౌజన్య ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## నేను ఎక్కడికీ పారిపోలేదు : మోహన్ బాబు

**బలగం టీవీ, హైదరాబాద్**



ముందస్తు బెయిల్ రద్దు అయిందని, మోహన్ బాబు పరారీలో ఉన్నాడంటూ శుక్రవారం నుంచి కొన్ని కథనాలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మోహన్ బాబు స్పందించారు. తాను పరారీలో ఉన్నానని.. పోలీసులు గాలిస్తున్నారని మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తవం అని అన్నారు. ‘నా ముందస్తు బెయిల్‌ను తిరస్కరించలేదు. ప్రస్తుతం నేను మా ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నాను. వాస్తవాలను మాత్రమే బయట పెట్టాలని మీడియాను కోరుతున్నా’ అని ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు.